నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 7 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

## శుద్ధజలం అందించాలి.. | కలెక్టర్ రాజర్షి షా


పొన్నలో బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, ఆగస్టు 6 : మండలవాసులకు మిషన్ భగీరథ ద్వారా నీరు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం సిరికొండ మండలంలోని పొన్న గ్రామంలో 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైపుల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. నీటిని పరీక్షించి నాణ్యతను గ్రామ పంచాయతీలో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి అంజాద్‌కు సూచించారు. మిషన్ భగీరథ మరమ్మతు పనులు పూర్తి చేసి, రోజు నీరు అందేవిధంగా చూడాలని మిషన్ భగీరథ ఏఈకి సూచించారు. అనంతరం పొన్నలోని బ్రిడ్జిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఏపీవో భీమేశ్, ఎంపీవో సంతోష్ కుమార్, కార్యదర్శి అంబాజీ, మిషన్ భగీరథ ఏఈ జైపాల్, డీఎల్‌పీవో ఫణిందర్ పాల్గొన్నారు.


పెంబి మండలంలో కడెం వాగుపై వరదల కారణంగా కొట్టుకుపోయిన వంతెన

# రహదారి కష్టాలు

## రోడ్ల కోసం పల్లె ప్రజల అరిగోస

- అటకెక్కిన పీఆర్, ఆర్అండ్‌బీ ప్రతిపాదనలు
- మరమ్మతులకు నిధులు కరువు
- వరదల కారణంగా కొట్టుకుపోయిన పస్పుల, గంగాపూర్ వంతెనలు
- పెంబి మండలంలో 10 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కాంగ్రెస్ పాలనలో నిధులు మంజూరు కాక తప్పని తిప్పలు

నిర్మల్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో కొంతకాలంగా రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూలిన వంతెనల నిర్మాణాలు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం పల్లె ప్రజలకు శాపంగా మారింది. భారీ వర్షాలతో కుప్ప కూలిన వంతెనలను నిర్మించలేదు. కనీసం వాటి మరమ్మతుకు చర్యలు చేపట్టకపోవడంపై సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. కడెం, పెంబి, దస్తురాబాద్, ఖానాపూర్, మామడ, కుభీర్, తానూర్ మండలాల్లోని మారుమూల గ్రామాల రోడ్లు దారుణంగా తయారయ్యాయి. పెంబి, కడెం మండలాల్లోని వాగులపై గల వంతెనలు వరదల కారణంగా కొట్టుకుపోయినప్పటికీ నిర్మించలేదు. కడెం వాగుపై పసుపుల వంతెన, గంగాపూర్ వంతెనలు ధ్వంసం కావడంతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పసుపుల వంతెన పునర్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు, గంగాపూర్ వంతెనకు రూ.22 కోట్లను మంజూరు చేసింది. అయితే ఈ లోగా ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వంలో మంజూరైన పనులను నిలిపివేయడంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల సమయంలో రోడ్లు, వంతెనలు నిర్మించకుంటే తాము ఓటేయబోమంటూ కూడా పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. అయితే అధికారులు వారికి నచ్చజెప్పి ఓటింగ్‌లో పాల్గొనేలా చేశారే తప్ప వారి సమస్యను పరిష్కరించలేదు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల పరిధిలోని రోడ్లు, వంతెనల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా.. సమస్య తీవ్రం కావడంతో పల్లె ప్రజలు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే కొన్ని రోజులుగా చాలా చోట్ల బురద రోడ్లపై వరినాట్లు వేసి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నారు.


వంతెన కొట్టుకుపోవడంతో ప్రమాదకర స్థితిలో కడెం వాగు దాటి వెళ్తున్న పసుపుల గ్రామస్తులు

### ప్రతిపాదనలు బుట్టదాఖలు

గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఆధునికీకరణ కోసం పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలు రూపొందిస్తున్న ప్రతిపాదనలను ప్రస్తుత ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు వర్షాల కారణంగా కొట్టుకుపోయిన రోడ్లతోపాటు కొత్తగా నిర్మించ తలపెట్టిన రోడ్ల ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంతో మొత్తం 80 గ్రామాల రోడ్ల మరమ్మతుల కోసం రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నప్పటికీ నయా పైసా మంజూరు కాలేదంటున్నారు. అలాగే ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలోని 40 రోడ్ల పరిస్థితి కూడా దయనీయంగానే ఉందంటున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులు రోడ్ల మరమ్మతుల కోసం రూ.36 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు విడుదల చేయాలని పలుమార్లు కోరారు. అయితే ఆర్అండ్‌బీ శాఖ ప్రతిపాదనలను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదంటున్నారు. కేవలం చిన్నచిన్న మేయింటెనెన్స్ పనులకు మాత్రం కోటి రూపాయలను విడుదల చేసిన ప్రభుత్వం మిగతా నిధుల విషయంలో ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

### మా కష్టం పగోడికి కూడా రావద్దు..



మాది పెంబి మండలంలోని హరిచంద్ తండా. మా ఊరిలో 60 కుటుంబాల వరకు ఉంటాయి. మాకు ఏ పని జరగాలన్నా కడెం వాగు దాటి పెంబికి పోవాల్సిందే. ఏడాది కింద వచ్చిన భారీ వరదలతో వాగుపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కూరగాయలు, పప్పులు, కిరాణ సామానును పెంబి గ్రామానికి పోయి తెచ్చుకుంటం. మా ఒక్క ఊరే కాదు మాతోపాటు పసుపుల, తులసీపేట్, దయ్యాల మద్ది, అంకెన, రాయదారి, కొరకంటి, కర్ణంలొద్ది, పోచంపల్లి మొదలగు గ్రామాల ప్రజలు కూడాఏడాదిగా ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో వాగులో నీళ్లు తక్కువగా ఉన్నప్పుడు నడుచుకుంటూ వాగు దాటి వెళ్లి సరుకులు తెచ్చుకుంటాం. వానకాలంలో వాగు దాటడం చాలా కష్టం. రోగాలు వస్తే దవాఖానకు కూడా పోలేం. అత్యవసరముంటే ప్రాణాలను లెక్కచేయకుండా వాగు దాటాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బ్రిడ్జి పనులు మొదలు పెట్టి మా కష్టాలు తీర్చాలి. *- గుగ్లావత్ రాంలాల్, రైతు, హరిచంద్ తండా, పెంబి మండలం.*


మావల సమీపంలో జాతీయ రహదారిపై గుంతల కారణంగా పక్క నుంచి వస్తున్న లారీ

# ప్రయాణం.. ప్రాణ సంకటం

- నేషనల్ హైవేపై అడుగడుగునా గుంతలు
- ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు
- లక్షల రూపాయల టోల్ వసూలు

*రోడ్ల నిర్వహణ సరిగ్గా నిర్వహించలేనప్పుడు టోల్ ప్లాజాల్లో టోల్ వసూలు చేయవద్దు. గుంతలతో కూడిన రహదారులు, టోల్‌ప్లాజాల వద్ద వాహనాల బారులు తీరడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర రహదారి, రవాణ జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నేషనల్ హైవే అధికారులు, టోల్ ప్లాజాల ఏజెన్సీలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను అధికారులు, టోల్‌ప్లాజా నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడం లేదు. రహదారి గుంతలమయంగా మారిన టోల్‌ప్లాజా నిర్వాహకులు రోజు లక్షల రూపాయల టోల్ వసూలు చేస్తున్నారు.*


గుడిహత్నూర్ మండలం సీతాగొంది వద్ద రోడ్డుపై గుంతలు


మావల సమీపంలో జాతీయ రహదారిపై గుంతలు

ఆదిలాబాద్, ఆగస్టు 6(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. జిల్లాలోని నేరడిగొండ మండలం రోల్‌మామడ నుంచి జైనథ్ మండలం డొల్లార వరకు 80 కిలోమీటర్ల రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆదిలాబాద్ జిల్లా మీదుగా ఉత్తరాది నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సరుకు రవాణాతో పాటు ప్రయాణికులను చేరవేస్తుంటాయి. నిత్యం వేలాది వాహనాల రాకపోకల సాగించే జాతీయ రహదారి 44 నిర్వహణను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) పరిధిలోకి వస్తుంది. రోడ్డు నిర్మాణ లోపం ఫలితంగా ఆదిలాబాద్ జిల్లాలోని జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండగా రోడ్డుపై గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల ఇచ్చోడ వద్ద రోడ్డుపై భారీ గుంతల కారణంగా లారీ డ్రైవర్ వేగాన్ని తగ్గించగా వెనక నుంచి వచ్చిన మోటార్ సైకిల్ లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది.

### నిర్వహణ గాలికి వదిలేసిన ఎన్‌హెచ్‌ఏఐ

ఇటీవల కురిసిన వర్షాల ఫలితంగా జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. రెండు నెలలు కావస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రోడ్డు చాలా చోట్ల దెబ్బతినడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడుతున్నారు. నాలుగు వరుసల రహదారి కావడంతో వాహనాలు వేగంగా పోతుంటాయి. రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించడానికి డ్రైవర్లు సడన్ బ్రేకులు వేయడం, పక్కకు తిప్పడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో పడి వాహనాలు పాడవుతున్నాయని డ్రైవర్లు అంటున్నారు. కార్లలో ప్రయాణించే వారు రోడ్డు చెడిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. రోగులు, గర్భిణులు రహదారిపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి లేదు. గుంతలో దిగిన వాహనాల పాడవడంతోపాటు మెల్లిగా పోవాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు.

### భారీగా టోల్ వసూలు

ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ రహదారి 80 కిలోమీటర్లు ఉండగా రెండు టోల్ ప్లాజాలు నేరడిగొండ మండలం రోల్ మామడ, జైనథ్ మండలం డొల్లార వద్ద ఉన్నాయి. ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి భారీగా పన్ను వసూలు చేస్తున్నారు. 2008 నుంచి పన్నులు వసూలు తీసుకుంటున్నా రోడ్డు భద్రతను గాలికి వదిలేశారు. ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి రోజు 10 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వాహనదారులు రెండు టోల్‌ప్లాజాల్లో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో టోల్‌ప్లాజా వద్ద కార్లకు రూ.160 మొదలుకుని భారీ వాహనాలకు రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. వాహనదారుల వద్ద నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ రోడ్డు నిర్వహణను గాలికి వదిలేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ హైవే అధికారులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచనలను పాటించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### బండి నడపాలంటే భయం వేస్తుంది..



హైవేపై బండి నడపాలంటే భయం వేస్తుంది. గుంతల కారణంగా లారీలు, కార్లు, ఆటోలు, ఇతరవాహనాలు రోడ్డుపై ప్రమాదకరంగా వస్తున్నాయి. గుంతలను తప్పించడానికి డ్రైవర్లు పక్కకు వస్తున్నారు. కొందరు సడన్ బ్రేకులు వేస్తున్నారు. దీంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో తెలువడం లేదు. రోడ్డు మరమ్మతులు చేయాల్సిన నేషనల్ హైవే అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.
*- శశికాంత్, దేవాపూర్, తలమడుగు*

# మా గోస తీర్చండి..

- 14 ఏండ్లుగా కుడి కాలువ పనులు అసంపూర్తి
- కాలువ నిర్మించాలని మూడు గ్రామాల రైతుల ధర్నా

ఇచ్చోడ, ఆగస్టు 6 : బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి గ్రామానికి బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాక సందర్భంగా మంగళవారం కుడి కాల్వ బాధిత రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చోడ మండలంలోని అడిగామ(కే) గ్రామ చెరువు నిర్మాణం 2006-07 సంవత్సరంలో చేపట్టిన కుడి కాలువ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ఈ చెరువు కింద అడిగామ(కే), అడిగామ(బీ), కోకస్‌మ్నూర్ గ్రామాలు ఉన్నాయన్నారు. దాదాపు 1000 ఎకరాల నీటి లభ్యత ఏర్పడుతుందని, కాల్వ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో 14 సంవత్సరాలుగా రైతులు నీటి సరఫరా లేక పంట వేయక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అనంతరం ఎస్సై నరేష్ వచ్చి రైతులను సముదాయించడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బద్దం లక్ష్మిరెడ్డి, భోజన్న, బద్దం నారాయణ రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, మల్లేశ్‌రెడ్డి, రవీందర్‌సింగ్ పాల్గొన్నారు.


అడిగామ(కే)లో ధర్నా చేస్తున్న కుడి కాలువ బాధిత రైతులు


గుండెపోటుతో ఎడ్లబండిపైనే మృతిచెందిన రైతు గోక సంజీవ్‌రెడ్డి

# పచ్చని చేనులోనే ఆగిన గుండె

## ఎడ్లబండిపైనే రైతు హఠాన్మరణం

తలమడుగు, ఆగస్టు 6 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన గోక సంజీవ్‌రెడ్డి(48) మంగళవారం ఉదయం చేనులో మందు పిచికారీ చేయడానికి ఎడ్లపై బండిపై వెళ్లాడు. చేనులోనే ఎడ్ల బండిపై గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన చుట్టూ పక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వచ్చి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సంజీవ్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


గోక సంజీవ్‌రెడ్డి(ఫైల్)


జయ శంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్


జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# జయశంకర్ సార్‌కు నివాళి

ఎదులాపురం, ఆగస్టు 6 : ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ రాజర్షి షా పూలమాల వేసి నివాళులర్పించారు. సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్, నర్సయ్య, స్టూడెంట్ అడ్వైజర్ రామేశ్వర్ రెడ్డి, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్ రమాదేవి, అధ్యాపకులు నిల్కమల్, రవికుమార్, సంజయ్‌సింగ్, ఫాతిమా, సంగీత, హేమలత, మురళీకృష్ణ, కుమారస్వామి పాల్గొన్నారు.

### పోలీసు కార్యాలయంలో..

ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ సురేందర్ రావు హాజరయ్యారు. జయశంకర్‌ను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు సార్ చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు.

### నేరడిగొండ మండలంలో..

నేరడిగొండ, ఆగస్టు 6 : నేరడిగొండ మండలంలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అమరుల త్యాగాల ఫలితంగా రాష్ట్రం సిద్ధించిందని అన్నారు. మండల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శిరీష్‌రెడ్డి, బోథ్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్ పాల్గొన్నారు.

# యూరియా కోసం బారులు

ముథోల్, ఆగస్టు 6 : మండలంలోని బోరిగాం గ్రామంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోదాంలో రైతులకు సరిపడా యూరియా లేకపోవడంతో రైతులు కష్టాలు పడుతున్నారు. మంగళవారం ఉదయం నుంచే రైతులు బారులుదీరిన కొందరికి అందకపోవడంతో నిరాశతో వెను తిరిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 400 మంది రైతులు, 1800 ఎకరాల వరకు సాగు భూమి ఉందని అధికారులు తెలిపారు. 160 టన్నుల యూరియా అవసరముండగా ఇప్పటివరకు 61 టన్నులు మాత్రమే రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం గ్రామానికి మరో 20 టన్నుల యూరియా వచ్చింది. మరి రావాల్సిందానికంటే 79 టన్నులు తక్కువ రావడంపై రైతులు అధికారులు, ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. క్యూలైన్‌లో 150 మందికి పైగా రైతులు ఉంటే ఒకరికి ఐదు చొప్పున 90 మందికే అందజేశారు. మిగతా 60 మంది నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఏవో భాస్కర్‌ను వివరణ కోరగా మరో రెండు, మూడు రోజుల్లోనే యూరియా వస్తుందని తెలిపారు.



బోరిగాం గోదాం వద్ద రైతులు

# పెళ్లి చేయడంలేదని..

## భైంసాలో యువకుడి ఆత్మహత్య


మహ్మద్ ఇమ్రాన్ (ఫైల్)

భైంసా, ఆగస్టు 6 : పెళ్లి చేయడం లేదని కలత చెంది ఓ యువకుడు గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని కుంట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్(26) తనకు పెళ్లి చేయాలంటూ తరచూ ఇంట్లో వాళ్లతో గొడవ పడే వాడు. ఈ క్రమంలో కలత చెంది సోమవారం సాయంత్రం స్నేహితులు షేక్ షకీల్‌తో కలిసి స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లి నీటిలో దూకాడు. షకీల్ కాపాడేందుకు నీటిలో దూకగా లోతు ఎక్కువగా ఉండడంతో బయటకు వచ్చేశాడు. దీంతో మహ్మద్ ఇమ్రాన్ నీటిలో మునిగి మృతి చెందగా మంగళవారం ఉదయం మృతదేహం వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఇమ్రాన్ తమ్ముడు మహ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఎండీ గౌసొద్దీన్ తెలిపారు.

## బాసర అమ్మవారి ఆలయ ఉద్యోగుల బదిలీ

బాసర, ఆగస్టు 6 : బాసర ఆలయంలో నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాసర సూపరింటెండెంట్ సంజీవ్‌రావు వేములవాడకు, జూనియర్ అసిస్టెంట్ విలాస్, పద్మలు వేములవాడకు, గోపాల్‌సింగ్ యాదగిరి గుట్టకు బదిలీ అయ్యారు. కాగా.. వీరి స్థానంలో యాదగిరి గుట్ట జూనియర్ అసిస్టెంట్ నరేశ్, వేములవాడ జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాస్, వేములవాడ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావు, భద్రాచలం పని చేస్తున్న కే. రామారావులు బాసరకు బదిలీపై వచ్చారు. వీరు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.